క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మధుసూదనరావు

స్వర్ణ(కారంచేడు): వేసవి దృష్టిలో ఉంచుకొని ఎండల తీవ్రతకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు తాగునీరు, మజ్జిగను గ్రామ సచివాలయ సిబ్బంది సమకూర్చడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ మోటాని మధుసూదనరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలోని బ్యాంక్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వారంలోగా బీమా రెన్యువల్స్ పూర్తిచేయాలి

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అందిస్తున్న వైఎస్సార్ బీమా రెన్యువల్‌ను ఈనెల 21 తేదీలోపు పూర్తి చేయాలని వైఎస్సార్ కేపీ ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. సోమవారం మండలంలోని గ్రామ పంచాయతీల్లోని సచివాలయాల పరిధిలో జరుగుతున్న వైఎస్సార్ బీమా రెన్యువల్స్ ప్రక్రియను ఏపీఎం పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పేద కుటుంబాల్లోని కుటుంబ పెద్ద అకాలమరణం చెందితే వారి కుటుంబానికి ఆర్థిక తోడ్పాడు అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. సచివాలయాల పరిధిలోని వలంటీర్లు 50 కుటుంబాల్లోని కుటుంబ పెద్దకు బీమా పథకాన్ని రెన్యువల్‌ను నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఏపీవో వెంట పలు పంచాయతీల్లో సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఉన్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

బల్లికురవ: మండలంలోని పాతమల్లాయపాలెం గ్రామంలో బుధవారం నుంచి జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రీలను మంగళవారంలోపు సమర్పించాలన్నారు. మొదటి బహుమతిగా రూ. 20 వేలు గ్రామానికి చెందిన జూపల్లి ఆంజనేయులు, రెండో బహుమతి జూపల్లి గంగాధర్, అబ్బారెడ్డి చక్రవర్తి, మూడో బహుమతి రూ.10 వేలు మల్లాయపాలెం యూత్ అందిస్తున్నారని తెలిపారు. వివరాలకు బీ. నాగార్జున 63050 12677 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న బైకు

మార్టూరు: మెడికల్ షాపులకు మందులు సరఫరా చేసే ఓ వ్యక్తి బైకు మార్గమధ్యంలో దగ్ధమైంది. ఈఘటన మండలంలోని వలపర్ల గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. చిలకలూరిపేటకు చెందిన మద్ది శేఖర్ ఓ హోల్‌సేల్ మెడికల్ ఏజెన్సీ తరపున పరిసర గ్రామాల్లోని మెడికల్ షాపులకు మందులు సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం శేఖర్ తన బైక్ మీద వలపర్ల వెళ్తున్నాడు. స్థానిక పెట్రోలు బంకు సమీపంలో సైలెన్సర్ వేడికి బ్యాగులో మంటలు అంటుకొని ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. శేఖర్ బైకును వదలి దూరంగా వెళ్లాడు. మంటల ధాటికి మందులు బ్యాగుతో సహా బైకు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. మొత్తం రూ.1 లక్ష మేర వాటిల్లినట్లు బాధితుడు శేఖర్ వాపోయాడు.

పండ్ల తోటల సాగుకు చేయూత

బల్లికురవ: ఉపాధిహామీ పథకంలో ఐదెకరాల్లోపు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులకు రాయితీపై పండ్ల తోటల సాగుకు చేయూత నిస్తున్నట్లు ఏపీవో బాలకృష్ణ నాయక్ సోమవారం తెలిపారు. జామ మామిడి, నేరేడు, దానిమ్మ, సీతాఫలం ఆపిల్ బేర్ సాగుచేసే రైతులు తన కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని 21 పంచాయతీల్లో 23 వేల మందికి కూలీలకు జాబ్ కార్డులుతో పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

చీరాల టౌన్: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని ఎంపీడీవో కె.నేతాజీ అన్నారు. సోమవారం ఈపురుపాలెం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించి వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విషజ్వరాలు ప్రబలకుండా మురుగునీటి గుంటలను పూడ్చి వేయించడంతో పాటుగా దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించారు. పంచాయితీ సెక్రటరీ గౌస్, పంచాయతీ సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

అభివృద్ధిలో స్పీడ్ మీటర్



నూతనంగా నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ



జగనన్న కాలనీలో ఇంటికి బిగించిన ఉచిత మీటరు

- జగనన్న కాలనీలకు విద్యుత్ వెలుగులు
- ఆరు జగనన్న కాలనీల్లో 1170 ఇళ్ల నిర్మాణం
- అన్ని ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

వేటపాలెం: మనిషికి కూడు, గుడ్డ ఎంత అవసరమో ఇల్లు కూడా అంతే అవసరం. ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలంతో పాటు పక్కా ఇంటి భాగ్యం కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కోట్ల నిధులు ఖర్చు చేసి ప్రైవేటు భూములు కొనుగోలు చేశారు. విశాలమైన స్థలాల్లో లే అవుట్లు ఏర్పాటు చేసి పేదలకు ఇళ్ల పట్టాలు అందించారు. ఆయా ప్రాంతాల్లోని ఇల్లు లేని పేద ప్రజలను గుర్తించి లబ్ధిదారులు ఎంపిక చేసి స్థలాలు మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణాలకు ఒక్కో లబ్ధిదారుడికి రూ. 1.80 లక్షలు ప్రోత్సాహకం అందిస్తోంది.



గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇల్లు

దీనితో పాటు పొదుపు సంఘాల ద్వారా బ్యాంకు రుణం మంజూరు చేయిస్తోంది. ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక ఉచితంగా అందిస్తున్నారు. దీంతో పాటు ఐరన్, సిమెంట్, తలుపులు, కిటికీలు తదితర నాణ్యమైన సామగ్రి చౌకగా సమకూర్చుతోంది. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకునేందుకు తోడ్పాటు అందిస్తున్నారు. జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తయిన ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లు అమర్చుతోంది. దీని కోసం ఒక్కో ఇంటికి మీటరుకు రూ.2 వేలు చొప్పున ఖర్చు చేస్తోంది.

మండలంలో జగనన్న కాలనీల్లో ఇలా..

మండల పరిధిలోని కొణిజేటి నగర్, చేనేతపురి, కొత్తపేట, మదర్ థెరిస్సా, జేవీఆర్ ఆరు కాలనీల్లో 1,170 ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. కాలనీల్లో రూ. కోట్లు నిధులు ఖర్చు చేసి మౌలిక వసతుల కల్పనతో పాటు నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లు, అంతర్గతంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు విద్యుత్ శాఖ ద్వారా 356 మీటర్లు ఉచితంగా ఇళ్లకు బిగించారు. నిర్మాణాలు పూర్తయిన వెంటనే విద్యుత్ మీటరు బిగించే పనిలో ఆ శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఒక్కో ఇంటికి బోర్డుతో పాటు, మీటర్, విద్యుత్ స్తంభం నుంచి ఇంటివరకు అవసమైన వైరు, ఇతర సామగ్రిని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోంది. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు..



నేనే ఆటో నడుపుకొని కుటుంబాన్ని పోషించుకొంటున్నాను. సొంతిల్లు నిర్మించుకోవాలన్నది మా కల. దీని కోసం 16 ఏళ్లుగా ఎదురు చూశాం. చివరకు జగనన్న ప్రభుత్వం మాకు స్థలంతో ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పుడు ఉచితంగా విద్యుత్ మీటరు కూడా బిగించారు. నెల రోజుల కిందట ఇంట్లోకి చేరాం. జగనన్నకు రుణపడి ఉంటాం.

– అట్ల పోలిరెడ్డి, కొణిజేటి నగర్ కాలనీ

ఉచితంగా మీటర్లు బిగిస్తున్నాం..



జగనన్న కాలనీల్లో ఇళ్లు పూర్తి చేసిన వాటికి వెంటనే విద్యుత్ మీటర్లు ఉచితంగా బిగిస్తున్నాం. మండలంలోని ఐదు లేఅవుట్లలో ఇప్పటివరకు 356 మీటర్లు బిగించాం. త్వరలో అన్ని ఇళ్లకు మీటర్లు బిగిస్తాం. కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేశాం.

– వీ భాస్కర్, విద్యుత్ ఏఈ, వేటపాలెం రూరల్

సీఎం జగన్‌ను కలిసిన ఆమంచి



సీఎం జగన్ మోహన్‌రెడ్డితో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ సోమవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా రాజకీయ పరిస్థితులపై ఆయన సీఎంతో మాట్లాడారు.

చెప్పింది చేయడం సీఎం జగన్ నైజం



లబ్ధిదారుడికి కరపత్రం ఇస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: చెప్పింది చేయడమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి నైజమని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని దైవాలరావూరులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసిన చైతన్య ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఆయన లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ జగనన్న చేసిన ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని ఎప్పటికీ ప్రజలు మరిచిపోరని,



ప్రజలతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

రానున్న ఎన్నికల్లో కూడా జగనన్ననే సీఎంగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందని కృష్ణచైతన్య చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సెగలు కక్కుతున్న సూరీడు

- వడగాడ్పులకు జనం హడల్
- చల్లగాలి కోసం కూలర్లు తెచ్చుకుంటున్న వైనం
- మూడు రోజుల నుంచి భానుడి భగభగలు





కూలర్లను మోటారు బైకులపై తీసుకెళ్తున్న జనం

అద్దంకి: రోహిణి కార్తె రాకముందే రోకళ్లు పగులుతున్నాయి. గత మూడు రోజుల నుంచి భానుడి భగభగలతోపాటు వడగాల్పులతో ప్రజలు హడలెత్తుతున్నారు. అడుగు బయట పెట్టాలంటేనే భయపడిపోతున్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. దీంతో పాటు వడగాలులు వీస్తుండడంతో జనం ఇంటికే పరిమితం అవుతున్నారు. చల్లదనం కోసం శీతల పానియాల దుకాణాల వద్దకు, ఇంట్లో చల్లదనం కోసం ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు.

45 డిగ్రీల పైమాటే..

గత మూడు రోజుల నుంచి అద్దంకి ప్రాంతంలో 43 డిగ్రీల నుంచి 45 డిగ్రీలకు పైగా ఎండ వేడిమి నమోదు కావడం విశేషం. దీంతో ఉదయం 5 గంటల లోపు, సాయంత్రం 6 గంటల తరువాతే బజార్లలో జనం కనిపిస్తున్నారు. మిగిలిన సమయంలో బజార్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనుల మీద బయటకు వెళ్లే వారు వెంట వాటర్ బాటిల్ తీసుకుని, తలపాగా కట్టుకుని వెళ్తున్నారు.

కూలర్లకు డిమాండ్..

బాగా డబ్బున్న వారు ఇంట్లో ఏసీలు, మధ్య తరగతి ప్రజలు కూలర్లను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే కూలర్లను కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకున్న వారు. మూడు రోజులు నుంచి కాస్తున్న ఎండకు మరమ్మతు కోసం కూలర్లను బాగు చేయించుకుని ఇంటికి తీసుకెళ్తున్నారు. ఏది ఏమైనా భానుడి భగభగలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఇంకా నాలుగైదు రోజులు ఇలాగే ఎండ వేడిమి ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వైద్యులు మాత్రం ప్రజలు చల్లని మజ్జిగ, నిమ్మరసం కలిపిన నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకుంటుండాలని సూచనలు ఇస్తున్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన



అద్దంకి: విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకి రూరల్: అద్దంకి శాఖాగ్రంథాలయంలో గ్రంథపాలకుడు చుండూరు సుగుణరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవిజ్ఞాన శిబిరానికి విశేషస్పందన లభిస్తోంది. 8వ రోజు సోమవారం నిర్వహించిన విజ్ఞాన శిబిరంలో 27 మంది విద్యార్థులు హాజరైయ్యారు. వీరికి మేథమేటిక్స్, స్పోకెన్ ఇంగ్లిషు, స్టోరీటెల్లింగ్ బోధించారు. అనంతరం విద్యార్థులకు బిస్కట్లు, స్వీట్లు పంచిపెట్టారు.

చినగంజాం: శాఖా గ్రంథాలయ పరిధిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు సోమవారం వారాంతపు నైపుణ్య పరీక్ష నిర్వహించారు. గ్రంథపాలకుడు అళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, డ్రాయింగ్‌లపై నైపుణ్య పరీక్ష నిర్వహించారు. పరీక్షలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేసారు. మొత్తం శిక్షణా శిబిరంలో 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి రిసోర్ పర్సన్‌లుగా వై రామాంజనేయులు, పల్లపోలు శ్రీబాబు తదితరులు పాల్గొన్నారు.



చినగంజాం: విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేసిన లైబ్రేరియన్

చీరాలలో..

చీరాల అర్బన్: విద్యార్థులు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ డీ ధనమ్మ అన్నారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం పిల్లలతో నీతి కథలు, జనరల్ నాలెడ్జ్ సుమతీ శతకాలు, ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాలు చదివించారు. అనంతరం ఉపాధ్యాయుడు వీ సాయికుమార్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే విజ్ఞాన శిబిరంలో విద్యార్థులందరూ పాల్గొనాలని ఆమె కోరారు.



చీరాల: విద్యార్థులకు ఇంగ్లిషుపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

చింతపల్లిపాడులో పర్యటించిన భరత్

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోరంట్ల సాంబయ్యపై ఇటీవల జరిగిన దాడితో గ్రామ ప్రజలను వైఎస్సార్ సీపీ నాయకుడు గొట్టిపాటి భరత్ ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. సోమవారం రాత్రి ఆయన గ్రామానికి వెళ్లి సాంబయ్య, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో పాదయాత్రగా తిరిగి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న భరత్

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

చీరాల రూరల్: దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్అండ్‌పీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చీరాల వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు దోగుపర్తి వెంకట సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇద్దరు పేద విద్యార్థులు నున్న ధనుంజయ, జీ ఉషశ్రీలకు రూ. 10,000 విలువ రెండు సైకిళ్లను పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్ చేతులు మీదుగా అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, డి. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితో శోభాయాత్ర విజయవంతం

చీరాల: జిల్లాలో కనివిని ఎరుగని విధంగా ఆదివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర విజయవంతం చేసిందినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు హనుమాన్ భక్త బృందం అధ్యక్షుడు మద్దుల బాలాజీ ఫణిరాజ్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హనుమాన్ భక్తబృందం సభ్యులు మాట్లాడారు. హనుమజ్జయంతి సందర్భంగా చీరాల బోస్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి దేవాలయం నుంచి పట్టణంలో నిర్వహించిన శోభాయాత్ర కనివిని ఎరుగని రీతిలో జైశ్రీరామ్...జై హనుమాన్ అంటూ నామస్మరణలతో జరిగిందన్నారు. శోభాయాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో భక్త బృందం గౌరవాధ్యక్షుడు ఉప్పుగుండూరి రామకృష్ణశర్మ, కార్యదర్శి వట్టిగుంట వెంకటేశ్వరరెడ్డి, ట్రెజరర్ చీమకుర్తి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. ఉత్తరాయణం వైశాఖ మాసం, ఉత్తరాభాద్ర నక్షత్రం, ఏకాదశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందెతీర్థం , మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

ఉచిత వైద్యశిబిరం అభినందనీయం

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో మండలంలోని పోతుకట్ల గ్రామంలోని విజయ గణపతి దేవాలయ ప్రాంగణంలో ఒంగోలు కిమ్స్ ఆసుపత్రి సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ సభ్యులు కోట శ్రీనివాసరావు ఉచిత వైద్య శిబిరానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన వారికి ఆసుపత్రికి వెళ్లేందుకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరం నందు చికిత్స పొందిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ రామాంజనేయులు, డాక్టరు రాణి చికిత్స అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు పాబోలు వెంకటేశ్వర్లు, కొమర్నేని వారిపాలెం సర్పంచ్ మున్నంగి వెంకట సుబ్బయ్య, ఆసుపత్రి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఫీ, వైద్యసిబ్బంది, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు